క్లుప్తంగా

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు : పీలేరు సర్కిల్ పరిధిలో 9 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ సి.హెచ్. వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీలేరు మండలంలో 6, కలకడ 2, కేవీపల్లె 1 మద్యం దుకాణాలకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంతో దరఖాస్తులు సమర్పించవచ్చునని తెలిపారు. ఈ నెల 11న రాయచోటిలోని లయ గార్డెన్స్, పుష్యమి గ్రూఫ్ ఆఫ్ ఫంక్షన్ హాల్‌లో పారదర్శకంగా లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎక్సైజ్ సీఐగా ఎస్.మాధవి



ములకలచెరువు: ములకలచెరువు సర్కిల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐగా ఎస్.మాధవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా నగరి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రామమోహన్ వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన సీఐ ఎస్.మాధవి మాట్లాడుతూ... సర్కిల్ పరిధిలోని మండలాల్లో నాటుసారా తయారీ, కర్ణాటక మద్యం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. అనంతరం సిబ్బంది సీఐ ని సన్మానించారు.

ఎక్సైజ్ ఎస్ఐగా వి.నారాయణస్వామి

రామసముద్రం: ఎక్సైజ్ నూతన ఎస్ఐగా నారాయణస్వామి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పని చేసిన హసీనా బేగం కళ్యాణదుర్గంకు బదిలీ అయ్యారు. కర్నూలు ఆదోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న నారాయణస్వామి రామసముద్రంకు బదిలీపై వచ్చారు. నూతన ఎస్ఐ నారాయణస్వామికి పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కలికిరి గ్రామ పంచాయతీ ఈఓగా అశోక్

కలికిరి: మండంలోని కలికిరి మేజర్ గ్రామ పంచాయతీ ఈఓగా జి.అశోక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పుంగనూరు నియోజవర్గం పులిచెర్ల మండలం నుంచి కలికిరికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ సిబ్బంది నూతన ఈవోకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కాగా ఇక్కడ పని చేస్తున్న ఈవో గురుమోహన్ పీలేరు గ్రామ పంచాయతీకి బదిలీపై వెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లయ్య, యోగేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

50 లీటర్ల సారా స్వాధీనం

రామసముద్రం: రామసముద్రం మండలం అరికెల పంచాయతీ దాసిరెడ్డిపల్లి సమీపంలో సారాబట్టిపై సోమవారం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తమ సిబ్బందితో కలసి దాడులు చేశారు. ఈదాడుల్లో 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 3 వేల లీటర్ల సారాను ధ్వంసం చేశారు. సారా బట్టి నిర్వహిస్తున్న హరీష్‌నాయక్ పరారీ అయినట్లు ఎస్ఐ తెలిపారు. హరీష్‌నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ లోకేష్, సిబ్బంది రెడ్డిశంకర్ రెడ్డి, కిరణ్‌లు ఉన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ వితరణ

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్టవద్ద నున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో సోమవారం దివ్యాంగులకు వీల్‌చైర్‌లను వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి అందజేశారు. నిమ్మనపల్లె మండలం బండ్లపై హరిజనవాడకు చెందిన కృష్ణప్ప అనే వృద్ధుడికి, సోమల మండలం అమిటి కృష్ణమూర్తి అనే వృద్ధుడికి వీల్ చైర్లు అందజేసినట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

పెద్దమండ్యం: మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జరిగినట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు సోమవారం తెలిపారు. పెద్దమండ్యం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న పెనుగొండ జగన్ మోహన్ బండ్రేవు పంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయినట్లు తెలిపారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఆయేషా కె వి పల్లె మండలానికి బదిలీపై వెళ్లినట్లు తెలిపారు. అలాగే సీ గొల్లపల్లె గ్రామ సచివాలయ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రెడ్డి మహ్మద్ రామానాయక్ తండాకు బదిలీ అయినట్లు చెప్పారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న బాలాజీ మందలవారిపల్లె కార్యదర్శిగా బదిలీ అయినట్లు చెప్పారు. సాధారణ బదిలీలలో భాగంగా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు కార్యదర్శులు ఆయా పంచాయతీలలో బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.

మండల పాలనాధికారిగా గౌస్‌బాషా

రామసముద్రం: మండల పాలనాధికారిగా గౌస్‌బాషా బాధ్యతలు స్వీకరించారు. ఆయన ములకలచెరువులో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రమణ గుండెపోటుతో మరణించడంతో గౌస్‌బాషా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పలువురు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చినుకు పడితే..రహదారులన్నీ చెరువులే

- రోడ్లపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- అవస్థలు పడుతున్న ప్రజలు



మదనపల్లె పట్టణం ప్రశాంత్‌నగర్ ప్రధాన రోడ్డులో వర్షానికి నీటి మడుగు (ఫైల్)

మదనపల్లె సిటీ: మదనపల్లె మున్సిపాలిటీ పేరుకు గ్రేడ్ వన్ మున్సిపాలిటీ. కానీ ఇక్కడ నిత్యం ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లుపై మురుగునీరుతో పాటు వర్షపు నీరు ప్రధాన రహదారుల్లో మోకాళ్లలోతు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు. వర్షం కురిసినప్పుడల్లా ప్రజలు తమ బాధలను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం పరిపాటిగా మారింది. సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా ఉంది. ప్రధానంగా కదిరిరోడ్డులోని జడ్జి బంగ్లా వద్ద వర్షం కురిస్తే చాలు అబ్బయ్యగారిపల్లె, ప్రధాన రహదారిలో మోకాళ్లలోతు నీళ్ల నిలిచిపోతాయి. గత మూడు నెలల నుంచి సమస్య అలాగే ఉంది. డ్రైనేజీ కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుపడడంతో మురుసీరు ప్రవహించకుండా నిలిచిపోతుంది. కాలువ నిర్మించాలంటే ఆర్ అండ్ బి పర్మిస్ అవసరం. దీంతో కాలువ నిర్మాణ పనులు జాప్యం జరుగుతోంది. రెండు శాఖల మధ్య వ్యవహారం కావడంతో ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంబేడ్కర్ సర్కిల్‌లో పై నున్న కోమటివానిచెరువు నుంచి మురుగునీరు పొంగిపొర్లుతుంది. దీనిపై పట్టించుకునే నాథుడే లేడు. బెంగుళూరు బస్టాండు, నిమ్మనపల్లె క్రాస్, మోతీనగర్, ఆర్టీసీ బస్టాండు సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, ప్రశాంత్‌నగర్, సిద్దార్థ కాలేజీ రోడ్డు, ఇందిరానగర్, దొంతివీధి, బాపనకాలువ, మేదరవీధి, రాంనగర్, పి అండ్ టి కాలనీ, కురవంక రెడ్డీస్ కాలనీ, సప్తగిరినగర్, వైఎస్సార్ కాలనీ ప్రాంతాలు వర్షం కురిస్తే నీటి ముడుగులను తలపిస్తున్నాయి.



చిన్నపాటి వర్షానికి జలమయమైన వైఎస్సార్ కాలనీ (ఫైల్)



బెంగళూరు బస్టాండులో షాపుల వద్ద వర్షపు నీరు (ఫైల్)

పాతకాలం నాటి డ్రైనేజీ కాలువలు:

పట్టణంలో పలు వార్డుల్లో ఇప్పటికి పాతకాలం నాటి డ్రైనేజీ కాలువలు ఉన్నాయి. పాత కాలువలో దెబ్బతినడం, చిన్న కాలువలు కావడంతో చిన్నపాటి వర్షం వస్తే చాలు రోడ్లపైనే వర్షపు నీరు నిలిచిపోతుంది. మురుసీరు రోడ్లపై నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శాశ్వత పరిష్కారం చేపట్టాలి



పట్టణంలో వర్షం వస్తే డ్రైనేజీ సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలి. పాత కాలం నాటి కాలువలు ఉండటంతో సమస్య తీవ్రంగా ఉంది. భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేయాలి. వర్షం వస్తే నీరు సక్రమంగా బయటకు పోయేలా చర్యలు తీసువాలి.

-గొల్లపూడి తిరుపతిరావు, టౌన్ అపెక్స్ అధ్యక్షుడు, మదనపల్లె

పారదర్శకంగా ఫ్రీ హోల్డ్ భూముల సర్వే

మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

కురబలకోట: ఫ్రీ హోల్డ్ భూ రికార్డుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, సర్వే పారదర్శకంగా చేపట్టి తప్పులుంటే వెంటనే సరిచేయాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ సూచించారు. సోమవారం ఆయన స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గంట పాటు ఫ్రీ హోల్డ్ భూ రికార్డులను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ భూ రికార్డులు రీ వెరిఫికేషన్ నూటికి నూరు శాతం పక్కాగా ఉండేలా చూడాలన్నారు. నిబంధనల మేరకు చట్టబద్దంగా సర్వే నిర్వహించాలన్నారు. అనుమతించినవి. తిరస్కరించినవి వివరాలు సహేతుకంగా ఉండాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలన్నారు. ఎక్కడైనా తప్పులు, అవకతవకలు, లోటుపాట్లు ఉన్నట్లు తేలితే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పక్కాగా ఫ్రీ హోల్డ్ భూముల సర్వే

పీలేరు రూరల్ : మండలంలోని ఫ్రీహోల్డ్ భూముల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని తహశీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 2003 సంవత్సరం కంటే ముందున్న డీకేటీ భూములను క్రమబద్ధీకరణ చేపట్టిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ భూములపై రీ సర్వే నిర్వహించాలని ఆదేశించినట్లు చెప్పారు. మండలంలో 5 వేల ఎకరాలకు సంబంధించి 4 వేల ఫైల్లు డీకేటీ భూములు ఉన్నాయని, ప్రతి సర్వే నెంబరుకు సంబంధించిన రికార్డులు సిద్ధం చేసి ఈ నెల 15లోపు జిల్లా కలెక్టర్‌కు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ రెడ్డెప్ప, సర్వేయర్ కిరణ్మయి, వీర్వోలు పాల్గొన్నారు.



కురబలకోటలో ఫ్రీ హోల్డ్ భూ రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

మార్కెట్‌యార్డులో అక్రమ షెడ్లు తొలగించాలి

మదనపల్లె : టమాటా మార్కెట్ యార్డులో అనుమతి లేకుండా అక్రమంగా వేసుకున్న షెడ్లను తొలగించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మార్కెట్‌యార్డులో రోడ్లపై షెడ్లువేసి రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్న ఫిర్యాదులపై ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎవరికి వారు ఇష్టారాజ్యంగా షెడ్లు ఏర్పాటు చేసుకోవడం, రోడ్డును ఆక్రమించడం, వ్యాపార కార్యకలాపాలు రోడ్లపైనే నిర్వహిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా షెడ్ల నిర్మాణాలు చేస్తుంటే మార్కెట్ కమిటీ సిబ్బంది ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నైట్ వాచ్‌మెన్, సూపర్‌వైజర్ పర్యవేక్షణ లేకపోవడం తోనే షెడ్లు ఏర్పాటైనట్లు గుర్తించామని, వారి సస్పెన్షన్‌కు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామన్నారు. అనుమతి లేకుండా వేసిన షెడ్లను తక్షణమే తొలగించాలని మార్కెట్‌కమిటీ సెక్రటరీ అభిలాష్‌ను ఆదేశించారు. షెడ్లుకు అనుమతి తప్పనిసరి అని, మార్కెట్‌కమిటీ ఆదాయానికి ఎవరు గండి కొట్టినా సహించేది లేదని హెచ్చరించారు.



మార్కెట్ కమిటీలో షెడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

– బీవైఎస్ అధ్యక్షుడు పునీత్

మదనపల్లె : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయినా ఇప్పటివరకు ఇచ్చిన హామీలు ఏవీ పూర్తిగా అమలు చేయడం లేదని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ అన్నారు. సోమవారం బీవైఎస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో పునీత్ మాట్లాడుతూ మదనపల్లె జిల్లా సాధన జేఏసీ ఆధ్వర్యంలో మదనపల్లెను జిల్లాగా ప్రకటించాలని చాలాకాలం నిరసనలు, ధర్నాలు నిర్వహించామన్నారు. టీడీపీ జాతీయ నాయకులు నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా మదనపల్లె మీదుగా వెళుతూ... టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మదనపల్లెను జిల్లాచేసి తీరుతామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీని నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి వై ఎస్ నాయకులు హరీష్, వేణుగోపాల్, ఆది, శశి కుమార్ శ్రీధర్,జగదీష్,శశి, నందీష్, సాదిక్, ఉమా తదితరులు పాల్గొన్నారు.

కలకడ ఎంపీడీఓగా అబ్దుల్‌రహీం



కలకడ : మండల ఎంపీడీఓగా అబ్దుల్‌రహీం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి బదిలీపై వెళ్లగా ఆ స్థానంలో అబ్దుల్‌రహీం వచ్చారు. మండలంలోని అన్ని పంచాయతీలలో మంచినీటి సమస్య రాకుండా చూస్తానని, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

నిమ్మనపల్లె ఎంపీడీఓగా పరమేశ్వర్‌రెడ్డి



నిమ్మనపల్లె : నిమ్మనపల్లి మండల అభివృద్ధి అధికారిగా జి.పరమేశ్వర్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గతంలో ఇక్కడ పనిచేస్తున్న పి.శేషగిరిరావు చిత్తూరు జిల్లా వడమాలపేట మండలానికి బదిలీ అయ్యారు. కలకడ మండలంలో పని చేస్తున్న జి.పరమేశ్వర్ రెడ్డి నిమ్మనపల్లి ఎంపీడీఓ గా బాధ్యతలను చేపట్టారు. ఏఓ రమేష్ బాబు, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇరిగేషన్ డీఈగా సేవలానాయక్

పీలేరు రూరల్ : పీలేరు ఇరిగేషన్ డీఈగా సేవాలానాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఈగా పని చేస్తున్న ప్రసన్నకుమారి బదిలీపై కదిరికి వెళ్లారు. ఆమె స్థానంలో తాడిపర్తిలో ఇరిగేషన్ డీఈగా పని చేస్తున్న ఎం. సేవలానాయక్ బదిలీపై పీలేరుకు వచ్చారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ నీటిపారుదల శాఖలో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

రేపు మేడికుర్తి ఆరిగంగమ్మకు బోనాలు

కలికిరి: మండలంలోని మేడికుర్తి సమీపం బాహుదానది ఒడ్డున వెలసిన శ్రీఆరి గంగమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రతి ఏటా బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీ. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన ఆరిగంగమ్మ జాతర వైభవంగా జరుగుతుంది. మేడికుర్తి గ్రామంతో పాటు మర్రికుంటపల్లి, మొర్రంకిందపల్లి, పత్తేగడ, పారపట్ల, వాల్మీకిపురం మండలం మాధవరంపల్లి తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు బుధవారం అమ్మవారికి ప్రీతిపాత్రమైన బోనాలు సమర్పించి మొక్కలు తీర్చుకోనున్నారు. ఆలయ కమిటీ, నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆదిపరాశక్తి ఆలయంలో శ్రీచక్రం ప్రతిష్ట

మదనపల్లె : పట్టణంలోని బెంగళూరురోడ్డులోని ఆదిపరాశక్తి ఆలయంలో సోమవారం శ్రీ చక్రం ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. రోచన్‌స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఆలయ పునర్నిర్మాణం, శ్రీ చక్రం ప్రతిష్ఠ కార్యక్రమంకు సర్పంచ్ చిప్పిలి చలపతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భార్య పసుపులేటి పార్వతమ్మ, కుమారుడు పసుపులేటి శశికుమార్‌తో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిప్పిలి చలపతి మాట్లాడుతూ...కోరిన కోర్కెలు తీర్చే ఆదిపరాశక్తి ఆలయం పునర్నిర్మాణం జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. అమ్మవారు భక్తులు కోరిన వరాలు ఇచ్చే దేవతగా ప్రసిద్ధి పొందారని, రోజురోజుకీ ఆలయానికి వస్తున్న భక్తుల సంఖ్య పెరగడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఆదిపరాశక్తి ఆశీస్సులతో ప్రజలు ఆనందంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు



ఆదిపరాశక్తి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

మానవత సంస్థలో 72 మందికి సభ్యత్వం

కలకడ : మానవత స్వచ్ఛంద సేవ సంస్థలో 72 మంది సభ్యులుగా సభ్యత్వం తీసుకున్నట్లు ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు పివి నాయుడు తెలిపారు. సోమవారం కలకడ టమాట మార్కెట్, యర్రయ్యగారిపల్లెలో కమిటీ సభ్యులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. టమాట కమీషన్ మండి ఏజెంట్ ఈ.ఆర్ తన తోపాటు అనేక మందిని నమోదు చేయించారు. మండలంలోనే కాక ఇతర మండలాలలో కూడా మానవత సేవా సంస్థ చేపట్టిన ఉచిత సేవాకార్యక్రమాలను గుర్తించి సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటేశ్వర, ఖాజాఫీర్, గంగాద్రినాయుడు, సయ్యద్ సాహెబ్, శ్రీనివాసులురెడ్డి, వైవి రమణ, మోహన్, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ రశీదును అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు, దాతలు

ప్రతి ఒక్కరూ సనాతన ధర్మం పాటించాలి

పీలేరు : ప్రతి ఒక్కరూ సనాతన ధర్మం పాటించాలని హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కారపాకుల భాస్కర్‌నాయుడు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సనాతన ధర్మం అనాధిగా వస్తున్న జీవనశైలి అని తెలిపారు. సనాతన ధర్మం ఆచరించే ప్రతి ఒక్కరూ తమ మతం తోపాటు ఇతర మత విశ్వాసాలను కూడా గౌరవించాలని కోరారు. అన్ని మతాలకు మత సామరస్య కమిటీలు ఉన్నాయని, సనాతన ధర్మ పరిరక్షణకు ఎలాంటి కమిటీలు లేవని ఆ దిశగా కమిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో నాయకులు నాగేశ్వర, శ్రీనివాసులునాయుడు, రామాంజులు, ముద్దు కృష్ణ, శేషాద్రినాయుడు పాల్గొన్నారు.

డిప్యూటి తహసీల్దార్‌గా సీహెచ్ నారాయణరెడ్డి

రామసముద్రం: రామసముద్రం మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న డీటీ శ్రీనివాసరావు నిమ్మనపల్లికి బదిలీ కాగా పీలేరులో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న నారాయణరెడ్డి బదిలీపై రామసముద్రంకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కల్పవల్లీ.. చల్లంగా చూడు తల్లీ








మదనపల్లె: అన్నపూర్ణదేవి అలంకారం, పీలేరు : బాలత్రిపురసుందరిదేవిగా, కలికిరి : మహాచండీ దేవిగా, వాల్మీకిపురం : ప్రత్యంగిరాదేవి అలంకరణలో, ములకలచెరువు: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, బి.కొత్తకోట: దుర్గాదేవికి పూజలు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు నయన మనోహరంగా సాగుతున్నాయి. సోమవారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శ్రీ దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారికి సారెను శేష్‌మహల్ ఏరియా, నెహ్రూనగర్ వాసులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం వాసవీ మహిళా సంఘంచే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని శ్రీచౌడేశ్వరి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణేశ్వరి అలంకారంలో భక్తులను ఆకట్టుకుంది. ఉదయం అమ్మవారి అభిషేకాలు, పూజలు జరిగాయి. తొగటవీరక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో అన్నదానప్రసాద వితరణ చేశారు. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో లలిత త్రిపుర సుందరిదేవి అమ్మవారిని అన్నపూర్ణదేవి అలంకరణతో అలంకరించారు. అర్చకులు ఫణికుమార్‌శర్మ ప్రత్యేక పూజలు చేసి భక్తులు ప్రసాద వితరణ చేశారు. స్థానిక సీటీఎం రోడ్డులోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారిని గాయిత్రిదేవి అలంకారం చేశారు. ఆలయంలో అర్చకులు పతాంజలిశాస్త్రి దేవి హోమం నిర్వహించారు. స్థానిక భువనేశ్వరినగర్‌లో వెలసిన భువనేశ్వరి అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు.

లలితాదేవి అలంకరణలో..

పీలేరు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే సోమవారం స్థానిక మోడల్ కాలనీలోని యల్లమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి బాలత్రిపురసుందరి అలంకరణ, పూజలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని రౌద్రాల అంకాలమ్మ అమ్మవారికి అభిషేకం నిర్వహించి కాత్యానిదేవి అలంకరణ చేశారు. విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బాలత్రిపురసుందరిదేవిగా..

కేవీపల్లె : మండలంలోని చీనేపల్లెల్లో వెలసిన శ్రీ రామలింగ చౌడేశ్వరి అమ్మవారు బాలత్రిపురసుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే గర్నిమిట్ట యల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు.

మహాచండీ దేవి రూపంలో ఎల్లమ్మతల్లి

కలికిరి: దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కలికిరి గ్రామదేవత ఎల్లమ్మ సోమవారం భక్తులకు మహాచండీ దేవి రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అర్చన, పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం చేశారు. సోమేశ్వరస్వామి ఆలయంలో దుర్గాదేవిని ప్రతిష్టించి నవరాత్రి పూజలు నిర్వహించారు. దుర్గాదేవి అన్నపూర్ణేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పత్యంగిరా దేవి అలంకరణలో..

వాల్మీకిపురం: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమారం స్థానిక శ్రీ నల్లవీరగంగాభవాని అమ్మవారి ఆలయంలో గంగాభవాని అమ్మవారు ప్రత్యంగిరాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే స్థానిక శ్రీ లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో కామేశ్వరి అమ్మవారు లలితాదేవిగా, వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో సంతోషిమాతదేవి, గండబోయనపల్లిలోని సత్యమ్మ తల్లి మహాచండిదేవిగా, గొళ్లపల్లిలోని విరూపాక్షమ్మ అమ్మవారు మహాచండిదేవిగా, చింతపర్తిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు సుబ్రహ్మణ్యస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో పూజార్లు జనార్దన్, ఉత్తన్న, అర్చకులు శీనాస్వామి, సుధీర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీచౌడేశ్వరిదేవిని తాకిన సూర్యకిరణాలు

కలకడ : దసరా ఉత్సవాలలో బాగంగా మండలంలోని కలకడ శ్రీచౌడేశ్వరిదేవి ఆలయంలో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సమయంలో సూర్యకిరణాలు అమ్మవారిని తాకాయి. కోన, గుడిబండ, కదిరాయచెర్వు, కె.బాటవారిపల్లె గ్రామాలలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి ఆలయాలు, మరియు గంగమ్మతల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఆర్యవైశ్యులు సోమవారం ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉభయదారులు, మహిళలు పాల్గొన్నారు.

ఏకవార రుద్రాభిషేకం

పెద్దతిప్పసముద్రం: శరన్నవ రాత్రి ఉత్సవాలు కనుల పండుగగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా పెద్దతిప్పసముద్రంలోని శివాలయం సేవకులు సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో సోమవారం పంచామృతాభిషేకం, ఏకవార రుద్రాభిషేకం, ప్రత్యేప పుష్పాలతో అలంకరణ కార్యక్రమాలను చూపరులను ఆకట్టుకునేలా నిర్వహించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట

బి.కొత్తకోట: దసరా ఉత్సవాల సందర్భంగా బి.కొత్తకోట కరెంట్‌కాలనీలో తొలిసారిగా దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఛత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవిని భక్తులు దర్శించుకొంటున్నారు.

కాత్యాయని అవతారంలో శ్రీచౌడేశ్వరిదేవి

రామసముద్రం: రామసముద్రం మండలం గుంతయంబాడి గ్రామంలో శరన్నవరాత్రులో భాగంగా శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారు సోమవారం కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.